www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 12 మే 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం ఈనెల 12 సోమవారం ఉదయం 10 గంటలనుండి యథావిధిగా కలెక్టరేట్లోని గోదావరి భవన్ లో నిర్వ:హిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయితో పాటు డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయి లో కూడా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. డివిజన్ స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాలలో నిర్వహిస్తారన్నారు. డివిజనల్ స్థాయి అధికారులు అందరూ సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయాలలో పాల్గొంటారన్నారు. మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం సంబంధిత మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహిస్తారన్నారు.

నీటిలోనే చేలు

- మొలకలు వస్తున్న ధాన్యం
- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు ఇంకా పలు వరిచేలు నీట నానుతున్నాయి. మరోవైపు నిలువ చేసుకున్న ధాన్యం రాసులు మొలకలెత్తుతున్నాయి. దీంతో దాల్వా పండించిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే మిగిలిన వరి కోతలు పూర్తిచేసి, ధాన్యం ఆరబెట్టుకుని ఆపై అమ్ముకునే వీలు ఉంటుందని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. రామచంద్రపురం మండలంలో 17200, కె.గంగవరం మండలంలో 15,560 ఎకరాలు వరిసాగుచేశారు. ఐదు రోజుల అనంతరం ఆదివారం కాస్త తెరిపి ఇవ్వడంతో రైతులు మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. దాళ్వా వరిచేలు 60 శాతం కోతలు పూర్తి కాగా మరో నలభై శాతం పంట వరి చేలలోనే ఉంది. ఇటీవల కురిసిన ఈదురుగాలులు భారీ వర్షాలకు పలు పంట చేలు నేలకొరిగాయి. మరికొన్ని పంటచేలు వర్షపు నీటిలో మునిగి ఉన్నాయి. వర్షం నీటును మురుగు కాలవల్లోకి పంపించి ఆరిన తర్వాత మళ్లీ కోతలు కోసేందుకు రైతులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు భారీగా కురిసిన వర్షాలకు హార్వెస్టర్లు సైతం కోతల కోసేందుకు వీలు లేక వరి చేలు అరే వరకు ఎదురుచూస్తున్నాయి. వాతావరణం అనుకూలిస్తే వారం రోజులలో దాళ్వా వరి పంట పూర్తిగా రైతుల చేతికి అందుతుందని, అదేవిధంగా ఆరబెట్టిన ధాన్యాన్ని అమ్ముకునే వీలు ఉంటుందని రైతులు భావిస్తున్నారు. పూర్తిగా ప్రకృతి మీద ఆధారపడిన వ్యవసాయం ప్రకృతి వైపరీత్యాలు వల్ల అకాల వర్షాల వల్ల రైతులకు విపరీతంగా నష్టాలు చేకూరుస్తుంది. .

300 ఎకరాల్లో నీట మునిగిన వరి పంట

కె.గంగవరం మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 300 ఎకరాలకు పైగా పంట నీట మునిగింది. పల్లప్రాంతాలలో వరిచేలు నీటిమనడంతో పంట కుళ్లిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో ఆరుగాలం పండించిన పంట చేతి పొందుతుందో లేదో అని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు పాడైన పంటలను కె.గంగవరం మండల వ్యవసాయాధికారి బలుసు రవి సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. పల్లప్రాంతాల్లోని వరి చేలో నిల్వ ఉన్న నీటిని వెంటనే కిందకు దించుకోవాలని, పంటను సంరక్షించు కొనేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అయితే అకాల వర్షాలతో ఎప్పటి వరకు 80 శాతం కోతలు పూర్తయ్యాయి. ఇంకా మండలంలో మరో 20 శాతం సుమారు మూడు వేల ఎకరాల్లో కోతలు కోయాలి ఉంది. మరో వారం రోజులు వర్షం రాకుండా ఉంటే వరికోతలు పూర్తిచేస్తామని రైతులు అంటున్నారు.

ఆదివారపుపేట గ్రామంలో వర్షం నీటిలో వరి చేలు, (ఇన్‌సెట్) ధాన్యంలో తేమ పరిశీలిస్తున్న రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి సత్యప్రసాద్

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించుకోవాలి. తడిసిన ధాన్యాన్ని మొలకలు వచ్చిన ధాన్యాన్ని ధర తగ్గించి కొనుగోలు చేస్తారు. నీట మునిగిన వరి పంట పాడవకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని వరి చేలో చల్లుకోవాలి. ప్రభుత్వ కేంద్రాలకు ధాన్యం విక్రయించడం వల్ల గిట్టుబాటు ధర 1725, దీంతోపాటుగా హమాలీ, కూలీ, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు అవనంగా పొందవచ్చు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. అదేవిధంగా నీటిలో మునిగిన వరి పంటను రక్షించుకునేందుకు మురుగు నీరును వెంటనే కాలువలోకి వదలుకోవాలి. తద్వారా పంటను కాపాడుకునే వీలుంటుంది.

- బలుసు రవి, కె.గంగవరం మండల వ్యవసాయ అధికారి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు

తడిసిన తేమ ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తాము. 18 శాతం తేమ ఉంటే రెండు కేజీల తరుగుతోను, 19 శాతం తేమ ఉన్నట్లయితే మూడు కేజీల తరుగు తోను, 20 శాతం తేమశాతం ఉన్న ధాన్యానికి ఐదు కేజీల తరుగు తోను ధాన్యం కొనుగోలు చేస్తున్నాము. రామచంద్రపురం మండల ంలో ఇంకా 2000 ఎకరాలు వరి కోతలు పూర్తి కావలసి ఉంది. పంట నేల వాలిన వరి చేలకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయడం వల్ల మొలకలు రాకుండా చూసుకోవచ్చు. ఇప్పటివరకు 76 10 ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు.

-సత్య ప్రసాద్, రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి

నత్త నడకన ధాన్యం కొనుగోలు

దాల్వా పంటలు పండించిన రైతులకు ధాన్యం కొనుగోలు మందగించడంతో వారు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం ధర రూ.1725 కేటాయించినప్పటికీ దళారులు కేవలం రూ.1500కే కొనుగోలు చేస్తున్నారు. మిలర్లు దళారులు కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు వేగవం తం చేసి రైతులకు గిట్టుబాటు ధర లభించేలాగా చర్యలు చేపట్టాలి. హమాలీ, రవాణా చార్జీలు రైతులకు అందే విధంగా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం తడిసిపోయి రైతులు ఇబ్బందులకు గురయ్యారని కొనుగోళ్ల వేగవంతం చేయాలి.

-ఇళ్ల సూర్యనారాయణ రైతు, శివల

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమనిరాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న పలు రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకు స్థాపన చేశారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గం అభివృద్ధి పనుల మీద దృష్టి సారించామన్నారు. రూ.5 కోట్ల ఉపాధి హామీ నిధులతో వెల్ల - ద్రాక్షారామ రోడ్డు నుంచి పసలపూడి కుసుమంబ ఫీల్డ్ వరకు, బాపనయ్య చెరువు పంచాయతీలో వెంకటాయపాలెం గణపతి నగరం రోడ్డుకు, రామచంద్రపురం మున్సిపాలిటీలో కొత్తూరు నుండి మాలపాడు వరకు రోడ్డు, యనమల గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను కూడా అందిస్తుందన్నారు. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామ న్నారు. మే నెలలో తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం జూన్ నెలలో అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సుభాష్

మాతృదినోత్సవంలో పాల్గొన్న మంత్రి సుభాష్

ప్రపంచ మాతృ దినోత్సవ సందర్భంగా రామ చంద్రపురం మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. చింతగుంట చెరువులోని మహిళలు వెంగళ సత్యవతి, మంగ, తదితరులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సత్కరించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ సృష్టిలో అమ్మ ప్రేమకు విలువ కట్టలేమని, ఆ ప్రేమ అపూర్వమైనదని అన్నారు. అమ్మ ప్రేమ ఉంటే అన్నిటా విజయం మన వెంటే ఉంటుందని, అమ్మ ప్రేమ పొందడం గొప్ప వరం అన్నారు. అనంతరం మాత దినోత్సవం సందర్భంగా అమ్మలను సన్మానిం చుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. మహిళల సంక్షేమం కోసం, అభివద్ధి కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం రూ. 5 వేల సాయం అందించారు.

సర్వేశ్వర శర్మకు సైన్స్ పాపులరైజేషన్ అవార్డు

ప్రజాశక్తి - అమలాపురం

హైదరాబాద్‌లోని ఐఐసిటిలోని వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సైన్స్ కాన్ఫరెన్స్‌లో అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సివి.సర్వేశ్వర శర్మకు సైన్స్ పాపులరైజేషన్ అవార్డ్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఈ అవార్డు అందుకున్న డాక్టర్ సర్వేశ్వర శర్మని పలువురు అభినందించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక విజ్ఞానం తప్పనిసరిగా ప్రజలకు వారికి అర్థమయ్యే భాషలో ప్రచారం చేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు.దీని కోసం రచయితలు రచనల ద్వారా ఉపన్యాసాల ద్వారా ఇంకా ఇతర ప్రక్రియల ద్వారా సైన్స్ ఫలాలను సామాన్యులకు అందించడం ఎంతో హర్షదాయకమని అన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న డాక్టర్ సర్వేశ్వర శర్మ

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కార్యక్రమంలో పాల్గొన్న కాట్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - కాట్రేనికోన

స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో 1998 -99 సంవత్సరం నందు పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయురాలు రాయుడు సత్యనారాయణమ్మ , అప్పట్లో పదవ తరగతిలో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాస రావు, దాసు, ఆనందరావు, వెంకటేశ్వరరావు, ముసలయ్య, సంజీవయ్య, లక్ష్మాజి, కుమార్, శేషవేణి, రామకృష్ణలను పూర్వ విద్యార్థులు సత్కరించి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 26 సంవత్సరాల తర్వాత పదవ తరగతి వరకు చదువుకున్న పాఠశాలలో కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యోగ వ్యాపార తదితర రంగాలలో రాణిస్తున్నప్పటికీ ఒకే వేదిక పైకి రావడం తో వయసు మరచి చిన్ననాటి జ్ఞాపకాలను, ఉపాధ్యాయులు బోధించిన విధానాన్ని గుర్తు చేసుకున్నారు. మాజీ ప్రధానో పాధ్యాయురాలు రాయుడు సత్యనారాయనమ్మ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నప్పుడే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడు జీవితంలో స్థిరపడి మంచి భవిష్యత్తును పొందడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడు పాజిటివ్ ఆలోచన దకృథాన్ని అలవర్చుకోవాలన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంలోనూ అప్పటి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాయుడు సత్యనారాయణమ్మ ఎనలేని కషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులను శాలువాలుతో పూల మాలలతో ఘనంగా సత్కరించారు. సిల్వర్ కాయిన్స్, మెమెంటో, నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఈతకోట జడ్‌పి ఉన్నత పాఠశాలలో..

రావులపాలెం: మండలపరిధి ఈతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 లో 10 వతరగతి వరకు విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఆత్మీయ కలయికతో అలనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఆదివారం ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు కెఎస్‌వి.కృష్ణారెడ్డి అధ్యక్షతన పూర్వం విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కలయికలతో ఒకరిని ఒకరు పలకరింపులతో అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారందరూ వివిధ రంగాల్లో రాణిస్తూ ఆనందంగా అప్పుడు చదువుకున్న రోజులను జ్ఞాపకం చేసుకున్నారు. విద్యను నేర్పిన తమ గురువులు మేథమెటిక్ ఉపాధ్యాయులు బులుసు అప్పన శాస్త్రి,డ్రాయింగ్ ఉపాధ్యాయులు వీర వెంకట సత్యనారాయణలను పూర్వ విద్యార్థులు పూలమాలలు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.గురువులు విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకుని తమ ఆనందాలను వ్యక్తం చేసుకున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న రావులపాలెం మండలంలోని ఈతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పలివెలలో ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలోని పలివెల పెద పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, ఆకుల రామకష్ణ, ఐఎఎస్ అధికారి ఈతకోట రమేష్ కుమార్ పాల్గొన్నారు ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, అపర మేధావి అయినటువంటి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత నడవాలన్నారు. ఆయన పేదలకు ఎన్నో మార్గాలను కల్పించి పూల బాటలు వేశారన్నారు. వాటిని మనకున్న, కలిగిన అవకాశాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎదుటివారికి ఇబ్బంది కలిగించకుండా నడవడమే ఆయనకు గౌరవం కలిగించినట్లన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ వడయార్, గ్రామ సర్పంచ్ సాగే లక్ష్మి శ్రీనివాస్, బూస్ట్ విజయలక్ష్మి, నెల్లి లక్ష్మీపతిరావు, చవల జగన్నాథం, బీర్ ఇస్సాక్, కూటమి నాయకులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బాల వీరాంజనేయస్వామి, ఎంఎల్ఎలు సత్యానందరావు, ఆనందరావు తదితరులు

శిథిలావస్థలో ఉన్న బోడిపాలెం వంతెన

వంతెనపై భారీ వాహనాలను నిలిపి వేయాలి

- పలు లంక గ్రామాల ప్రజల విజ్ఞప్తి
- శిథిలాస్థకు చేరిన బోడిపాలెం వంతెన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

శిథిలావస్థలో ఉన్న బోడిపాలెం వంతెనపై భారీ వాహనాలను నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. బోడిపాలెం వంతెన శిథిలావస్థలో వుందని తెలిసినా ప్రతి నిత్యం వందలాది లారీలు 40-50 టన్నుల మట్టి లోడ్ తో ఇటుక బట్టిలకు వెళుతూ వుంటాయి.. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. కపిలేశ్వరపురం మండలం లంక గ్రామాల సమీపంలోఉన్న బోడిపాలెం వంతెన శిథిలావస్థకు చేరుకుంది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన గత కాలం నుండి పాలకులు, అధికారులు శిథిలావస్థలో ఉన్న వంతెన నిర్మిస్తామని అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సంబంధిత అధికారులు ఇంతవరకు వంతెన నిర్మాణ పనులు చేపట్టలేదు. కేదార్‌లంక, వీధి వారి లంక, నారాయణ లంక గ్రామస్థులు ప్రతి నిత్యం ఏ చిన్న పని కైనా కొత్తపేట, రావులపాలెం, అమలాపురం వంటి ప్రాంతాలకు వెళ్ళాలంటే ఈ వంతెనే ఆధారం. ఈ వంతెన కాస్తా కూలి పోతే తమ పరిస్థితి ఏంటని లంక గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గత కొద్ది రోజుల నుండి మందపల్లి సమీపంలోని లంక భూముల నుండి కొంత మంది మట్టి వ్యాపారులు ఇటుక బట్టిలకు మట్టిని భారీ వాహనాలతో ఈ వంతెన పైనే వ్యాపారం సాగిస్తున్నారు.. అంతే కాకుండా రహదారుల పై అతి వేగంతో భారీవాహనాలు వెళ్లడం వల్ల వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కార్టూ'నిజం'



పాము విషానికి..
తిరుగులేని విరుగుడు!
మనిషి రక్తం నుంచి తయారీ

థర్డ్ సెమిస్టర్ ఫలితాల్లో మోడరన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ థర్డ్ సెమిస్టరు ఫలితాలు ఈనెల 10న ప్రకటించారు. రాచంచంద్రపురం పట్టణంలోని లయన్ జివి. రావు డిగ్రీ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్ పాయింట్స్ సాధించి యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ 8.7 గ్రేడ్ పాయింట్స్ నుంచి 9.4 గ్రేడ్ పాయింట్స్ వరకు బిఎస్.సి, బికామ్, బిసిఎకి చెందిన విద్యార్థులు 12మంది యూనివర్సిటీ టాప్ ర్యాంక్‌లు సాధించినట్లు తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో సిలబస్ బోధన, సమగ్ర ప్రణాళికతో తాము ఫలితాల్లో ప్రతీ విద్యా సంవత్సరం ముందజలో ఉంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులను అధినేత జివి రావు, ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు, అకాడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌదరి, మోడరన్ స్టాఫ్ అభినందించారు.

టాపర్స్‌గా నిలిచిన మోడరన్ డిగ్రీ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న లయన్ జివి.రావు తదితరులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బ్యాంక్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

216 ఎ జాతీయ రహదారిపై మండలంలోని చొప్పెల్ల పంట కాలువ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ప్రయివేటు బ్యాంక్ ఉద్యోగి మృతి చెందాడు. ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం..మడికి శివారు చిలకలపాడుకు చెందిన కొత్తపల్లి ఆనంద్ వెంకటరత్నం హరీష్(32) రాజమహేంద్రవరం ఐసిఐసిఐ బ్యాంక్ నందు క్రెడిట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో రాత్రికి గ్రామంలో తన స్నేహితుని పెళ్లికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై రావులపాలెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి చొప్పెల్ల లాకుల సమీపంలో ఉన్న పంట కాలువ వంతెన కాంక్రీట్ రైలింగ్‌ను ఢీకొంది. దీంతో ఆనంద్ తలకు బలమైన గాయాలు తగిలి ఘటన స్థలంలోనే మతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వచ్చిన సమాచారంతో ఎస్ఐ అశోక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అలాగే మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. మృతుడికి భార్య, ఒక చిన్న పాప ఉన్నారు.

బస్సు ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ఖండవల్లి జాతీయ రహదారిపై ఆదివారం బైకును బస్ ఢీకొని భార్యాభర్తలకు గాయాలయ్యాయి. తణుకు నుంచి రావులపాలెం వైపు వెళుతున్న బైపాస్ ఎక్స్‌ప్రెస్ ఖండవల్లి సెంటర్లో రావులపాలెం వైపు బైకుపై ఇద్దరు పిల్లలతో వెళుతున్న భార్యాభర్తలు కపిలేశ్వరపు రామకష్ణ, ఆదిలక్ష్మి ఢీకొంది. ఈ సంఘటనలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వారిని తణుకు జిల్లా ప్రాంతీయ హాస్పిటల్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు

కోనేరులో గుర్తు తెలీని మృతదేహం

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి కోనేటిలో గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం కోరుకొండ విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోనేటిలో సుమారు 45 ఏళ్ల వయస్సు గల మృతదేహాన్ని బయటకు తీసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం గుర్తింపు కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో వివరాలు తెలపాలన్నారు.

ట్రాక్టర్ బైకు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామం శివారు ఇజికె రోడ్డులో ట్రాక్టర్ బైకు ఢీకొని యువకుడు మృతి చెందాడు. దొమ్మేరు గ్రామానికి చెందిన చిగురుపల్లి విద్యాసాగర్ (20) కాపవరం వైపు నుండి దొమ్మేరు వస్తుండగా దొమ్మేరు గ్రామ శివారులో గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో బైకుపై వెళుతున్న విద్యాసాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గొల్లప్రోలులో...

మండలంలోని చేబ్రోలు గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాడేరు జిల్లా ముంచుపట్టు మండలం మచ్చేపురం గ్రామానికి చెందిన కోడ మోహన్(21) చేబ్రోలు లక్ష్మీపురం వద్ద ఉన్న చేపల చెరువులో పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో యజమాని యాళ్ల వెంకటరమణ సూచనతో చేపల చెరువు పనివారలకు భోజనాలు తీసుకురమ్మన్నారు. దీంతో మోహన్ మోటార్ సైకిల్ పై వెళుతుండగా చేబ్రోలు లక్ష్మీపురం మలవరం గేటు సమీపంలో మట్టితో వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతిని సోదరుడు కొడ గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం .. ఆత్రేయపురం రేవులో ఆదివారం సాయంత్రం వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో ఇరువురు ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి ఉండడంతో వారి బ్రీతింగ్ ఎనరైజర్ మిషన్‌తో పరీక్షించారు. వారిద్దరూ పరిమితి కంటే ఎక్కువ మద్యం తాగినట్టు పాయింట్లు రావడంతో ఇరువురుపై కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - కరప

మండలంలోని గురజనాపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో ఆదివారం ఎస్ఐ టి.సునీత ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,730 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - కరప

కరప గ్రామంలో ఒక అమ్మాయి మెడలోంచి 2 కాసుల బంగారు గొలుసును లాక్కొని పోయిన సంఘటనపై కేసు నమోదైనట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు. కాకినాడ గైగలపాడుకు చెందిన నక్క లక్ష్మీ, అలేఖ్య, హన్సిక కలిసి కరప మండలం జడ్.భావారంలో జరుగుతున్న వనుములమ్మ జాతరకు వస్తున్నారు. వేలంగి వైపు బైక్ పై వెళ్తున్న ఒక గుర్తు తెలియని వ్యక్తి అలేఖ్య వెనుకనే వస్తూ కరప శివారు డంపింగ్ యార్డ్ వద్ద హన్సిక మెడలో ఉన్న బంగారపు గొలుసును లాక్కుని పోయాడు. దీంతో బాధితిరాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంట కాలువల్లో పూడికతీతకు చర్యలు

ఇరిగేషన్ ఎస్ఇ కె.గోపీనాథ్

ప్రజాశక్తి - అమలాపురం

వేసవి అనంతరం కాలువలకు సాగునీరు విడుదల చేయకముందే పంట, మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలి. జులై నుంచి గోదావరి వరదల సీజన్ ప్రారంభం అవుతుంది. ఈ లోగా బలహీన ఏటిగట్లు, అవుట్ పాల్ స్లూయిజ్‌లకు మరమ్మతులు చేపట్టాలి. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ ధవళేశ్వరం సర్కిల్ ఎస్ఇ కె.గోపీనాథ్ ప్రజాశక్తి ముఖాముఖి నిర్వహించింది. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన వివరించారు.

గోదావరి వరదల నివారణకు సన్నద్ధంగా ఉన్నారా

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బలహీన ఏటిగట్లు, నూతన అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణం, కొన్ని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు శాశ్వత రక్షణ పనులు, ఫ్లడ్ స్టోర్స్‌లో వరద రక్షణ సామగ్రి ఏర్పాటు వంటివి చేసేందుకు నిర్ణయించాం.

వచ్చే వరదల్లో రక్షణ చర్యలకు కేటాయింపులు ఉన్నాయా

ప్రత్యేకించి వరద రక్షణకు రూ.16.90 కోట్లు కేటాయించాం. వైనతేయ ఎడమ ఏటిగట్టు పరిధిలో నాలుగు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు శాశ్వత పనులు పూర్తయ్యాయి. కుడి ఏటిగట్టు వశిష్ట ఎడమ ఏటిగట్టు రూ.13.20 కోట్లతో వాడబోది, బచ్చలబంద, కడలి, రాళ్లకాలువ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను నిర్మించాలి. గౌతమి కుడి ఏటిగట్టు పరిధి బూలవారిమొండి వద్ద రూ.32 లక్షలతో గట్టును పటిష్ఠ పరిచాం. గొల్లగరువు, జి.మూలపొలం అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్మాణం చేపట్టేందుకు ప్రాధాన్యత ఇచ్చాం.

పంట కాలువల్లో పూడికతీత పనులు ఏ మేరకు నిర్వహిస్తారు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంట, మురుగు కాలువల్లో పూడికతీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు 853 గుర్తించాం. రూ.35.81 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నాం. నిధులు విడుదల కావాల్సి ఉంది.

ఈ పనులు సాగు నీరు విడుదల చేసే లోపు పూర్తి చేయగలరా

పూడికతీత పనులు కాలువలకు సాగు నీరు విడుదల చేసే లోగా పూర్తిచేస్తాం. రూ.10 లక్షల లోపు పనులను సాగునీటి సంఘాల ద్వారా చేయిస్తాం. ఆ పైన విలువైన వాటిని స్టార్ట్ టెండర్లు పిలిచి చేపడతాం. ఏదేమైనా కాలువలకు సాగునీరు విడుదల చేయక ముందే పూడికతీత పనులు పూర్తి చేస్తాం.

కాలువల ఆక్రమణలు, కాలుష్యం నివారణకు చర్యలు

కాలువలను ప్రక్షాళన చేయాలి. వీటిల్లో మురికినీటి తూరలను తొలగించేందుకు గ్రామ పంచాయతీలు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే కార్యదర్శులకు నోటీసులు జారీ చేశాం. ఆక్రమణలు తొలగించేందుకు అందరి సహకారం ఎంతో అవసరం.

ఆక్రమణలను గుర్తించడానికి ఏ విధమైన ఏర్పాట్లు చేస్తున్నారు

గోదావరి డెల్టా సిస్టమ్‌లో పంట, మురుగు కాలువలు, వివిధ కట్టడాలు ఏ స్థాయిలో ఉన్నాయి అనే దానిపై లైడార్ సర్వే చేయిస్తాం. ఈ సర్వే చేయడానికి రూ.16.07 కోట్లు ఖర్చవుతుంది. ఈ సర్వే ద్వారా ఆక్రమణలు గుర్తించి వారికి నోటీసులు అందజేస్తాం.

జాబ్ మేళాతో నిరుద్యోగులకు ఆర్థిక భరోసా

- మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

ప్రజాశక్తి - పి.గన్నవరం

సమాజంలో నిరుద్యోగులకు స్వతంత్రంగా ఎదిగేందుకు వారికి ఆర్థిక భరోసా కల్పించడమే జాబ్ మేళా లక్ష్యమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ మరియు గిడ్డి శ్యామల రాణి ఫౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో టాటా ఎలక్ట్రానిక్స్, హోసూర్ వారి సంయుక్త సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాను మంత్రి, ఎంఎల్ఎలు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ నిరుద్యోగాన్ని సమూలంగా రూపుమాపే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఒకపక్క ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపడుతూనే, మరోపక్క పారిశ్రామికంగా ప్రోత్సహించే లక్ష్యంతో నూతన పరిశ్రమలు స్థాపనకు కృషి చేస్తుందన్నారు. నూతన పరిశ్రమల ఏర్పాటుకు సుమారు రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, వీటి ద్వారా మూడు లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి అన్నారు. అనంతరం ఉద్యోగ మేళా ద్వారా 18 నుంచి 25 వయస్సు కలవారికి ఐటిఐ, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. మహిళలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు. రానున్న రోజుల్లో మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ నిర్వాహకులు అన్నారు. ఈ జాబ్ మేళాకి 110 మంది పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూకి హాజరు కాగా వారిలో ఎంపికైన 30 మందికి నియామక పత్రాలు అందించి ఉద్యోగాలు అవకాశాలు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాటా సంస్థ హెచ్ఆర్ లు దీపిక, శాంతిల్, కూటమి నాయకులు, నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, డివివి.సత్యనారాయణ, శిరిగినీడి వెంకటే శ్వరరావు, పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి, నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి సుభాష్

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - కొత్తపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, కొత్తపటే ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం వాడపాలెం చేరుకుని పెద దళితపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెద్ద దళితపేటలోని జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి అందించేందుకు రూ.96.80 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఒహెచ్ఎస్ఆర్ (వాటర్ ట్యాంక్) ను ప్రారంభించారు. మారెమ్మ మాన్యంలో రూ.77 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అలాగే రూ.43.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో సర్కార్ లో గ్రామాల అభివద్ధి అడుగంటిందని, పాలనా పరంగా నిర్లక్ష్యం అలుముకున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివద్ధి పై ప్రత్యేక దృష్టి సారించామని ప్రజల మౌలిక సదు పాయాలను సమకూరుస్తున్నామని తెలిపారు. పరిపాలనలో ప్రక్షాళన చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రేడ్ల వారీగా సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించి పరిపాలనా సౌలభ్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని గత ప్రభుత్వం పేరు మార్చి మాజీ సిఎం పేరు వేసుకున్నారని, అంబేద్కర్ పై వైసిపి నేతలకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ప్రజలకు అర్థం అయ్యిందని మంత్రి అన్నారు. అంబేద్కర్ పై చిత్తశుద్ధితో ఉన్న కూటమి ప్రభుత్వం ఆయన పేరు మీద ఉన్న విద్యా పథకాన్ని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. అధిక శాతం మంది పేదలకు ఈ పథకాన్ని అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం నారా చంద్రబాబు తమ శాఖకు సూచించినట్లు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుకు సిద్ధంగా ఉందని మంత్రి డోలా వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ విషయంలో రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.అలాగే స్థానిక ఎంఎల్ఎ సత్యానందరావు కోరిన విధంగా అభివృద్ధి పనులను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రజలందరికీ మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో అన్ని గ్రామాల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నామని ఎంఎల్ఎ పేర్కొన్నారు. కూటమి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి బాల వీరాంజనేయస్వామి, ఎంఎల్ఎ సత్యానందరావు, కూటమి నాయకులు, అధికారులు

మంత్రికి ఘన స్వాగతం పలికిన ఎంఎల్ఎ

రావులపాలెం: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆదివారం స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద పుష్పగుచ్ఛంతో ఘనస్వాగతం పలికారు. మంత్రి మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వె ళుతున్న నేపథ్యంలో ఎంఎల్ఎ పార్టీ శ్రేణులతో కలిపి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుత్తుల పట్టాభిరామారావు, మాసాబత్తుల ఆనందరావు, కాసా విజయసాగర్, అల్లూరి పెదకృష్ణంరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకుమూరి జ్యోతి అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం...జ్యోతి సీతానగరం నుంచి వంగలపూడికి తన బైక్‌పై వెళ్తుండగా, సింగవరం మసీదు సమీపంలో రోడ్డుపై ఉన్న ఇసుక కారణంగా బైక్ అదుపుతప్పి కిందడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జ్యోతిని వెంటనే రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల చేపట్టేందుకు సోమవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కొత్తపేట, చిన్నవీధి, కోటపేట, ఉప్పు వారి వీధి, పాత రెవెన్యూ కార్యాలయం, బలుసుల పేట, సంగీతరావుపేట, వీర రాఘవపురం, నీలమ్మ చెరువు, ఇందిరా కాలనీ, పెన్షన్ లైన్, పేరంటాల పుంత తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

వానపల్లిపాలెం మాజీ సర్పంచ్ నాగేంద్రుడు మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

నాగేంద్రుడు (ఫైల్)

మండలంలోని వానపల్లిపాలెం మాజీ సర్పంచ్ సక్కా నాగేంద్రుడు (88) ఆదివారం వయోభారంతో మృతి చెందారు. ఆయనకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. 2001 నుంచి 2005 వరకు నాగేంద్రుడు వానపల్లిపాలెం సర్పంచ్‌గా పని చేశారు. మాజీ సర్పంచ్ నాగేంద్రుడు మృతి పట్ల సర్పంచ్ నల్లా వెంకటేశ్వరరావు(బాబండి), గ్రామస్తులు తదితరులు సంతాపం తెలిపారు.

నేడు డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో ఉన్న అసంబద్దాలను పరిష్కరించిన తరువాత బదిలీలు, ఉద్యోగన్నతులను చేపట్టాలని డిమాండ్ చేస్తూ నేడు డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిసున్నట్లు యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల పునవ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లలో సమస్యలను పరిష్కరించాలని, రేషనైజేషన్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు పాత స్టేషన్ పాయింట్లతో పాటు రేషనైజేషన్ పాయింట్‌లు ఇవ్వాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి స్టడీ లీవ్‌లో వెళ్లి 3 నెలల్లో తిరిగి జాయిన్ అయ్యే వారి స్థానాలను క్లియర్ వీకెండ్‌గా చూపడం సమంజసం కాదన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఒకేలా ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ఉండేలా చూడాలని, పోస్టు బ్లాక్ చేయకుండా బదిలీలు చేపడతామని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని కోరారు. తదితర డిమాండ్ల సాధన కోసం సోమవారం డిఇఒ కార్యాలయం వద్ద సోమవారం ఉద యం 9.30 గంటలకు జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దు

ప్రజాశక్తి - కాజులూరు

రైతులు ఆత్రుతతో ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ సూచించారు. ఆదివారం మండలంలోని జగన్నాథగిరి, గొల్లపాలెం, కాజులూరు, చేదువాడ గ్రామాల్లో కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షంతో 50 శాతం వరకు మాసూళ్లు పూర్తి అయ్యాయని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో వరి పంట నేలనంటిందని, సంబంధిత రైతులు మల్లల్లో ఉన్న నీటిని దిగువకు పోయేలా బోదులు చేసుకోవాలన్నారు. మొలకలను నివారించడానికి ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. మొలక వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తారన్నాడు. వ్యవసాయ శాఖ, సచివాలయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వేగంగా బోరు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తూర్పుపాకల గ్రామంలో పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న మంచినీటి బోరు పనులు వేగంగా సాగుతున్నాయని గ్రామ టిడిపి ఇన్‌ఛార్జ్ పడాల వీరరాఘవులు అన్నారు. ఆదివారం బోరు నిర్మాణ పనులను సర్పంచ్ అన్నపూర్ణతో కలిసి పరిశీలించారు. జల జీవన్ మిషన్ నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారని,పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా నిమిత్తం పంచాయతీ నిధులతో రెండో బోరు నిర్మిస్తున్నట్లు తెలిపారు.



విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - అయినవిల్లి

ఎస్‌సి వెల్ఫేర్ ఆధ్వర్యంలో అయినవిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134 వ జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు అనంతరం పలువురు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కషి చేయాలన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, భారత తొలి న్యాయశాఖ మంత్రిగా, స్వాతంత్రోద్యమ వీరుడిగా ఆధునిక భారత సమాజ నిర్మాణానికి అంబేద్కర్ పునాదులు వేశారని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని 11 ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు కి నగదు బహుమతి, మెమెంటోలను పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ చేతులు మీదుగా అందజేశారు. అనంతరం కీర్తిశేషులు దుక్కిపాటి శ్రీనివాసరావు అవార్డు రిటైర్డ్ టీచర్ బద్దె సత్య రామ ప్రసాద్‌కు ఎమ్ఎల్ఎ సత్యనారాయణ చేతులు మీదుగా అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం నియోజవర్గ వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపిపి మట్టపర్తి నాగ విజయలక్ష్మి, అంబాజీపేట ఎఎంసి ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, ఎస్‌సి వెల్ఫేర్ అధ్యక్షులు నేరెడిమిల్లి సత్యనారాయణ , ప్రధాన కార్యదర్శి అబ్బులు, ఆర్థిక కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షులు నకులరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, జె భీమరావు, ఉద్యోగస్తులు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి స్టేట్ క్రికెట్ అసోసియేషన్ అనుబంధ యానాం క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్టకూరు హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న సియాచిమ్ క్రికెట్ టోర్నమెంట్ - 2025 ముగిసింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో అగ్ని లయన్స్‌పై అంబేద్కర్ లెవెన్స్ ఘన విజయం సాధించింది. మొత్తం పది జట్లు పోటీ పడగా విన్నర్‌గా అంబేద్కర్ లెవెన్స్, రన్నర్‌గా అగ్ని లయన్స్ జట్లు నిలిచాయి. మూడో జట్టుగా కెవిఆర్ నిలిచింది. విజేతలకు ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, సిఐ అడలరసన్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు..

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు, సామర్లకోట

మండలంలోని జార్జిపేట వై-జంక్షన్‌లో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీలు చేశారు. కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో కోరంగి, గొల్లపాలెం ఎస్ఐలు పి.సత్యనారాయణ, మోహన్, సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీలు చేశారు. భారత్- పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. అలాగే సామర్లకో రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్ బృందంతో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సామర్లకోట సిఐ ఎ.కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. వాహనాలను తనిఖీలు చేశారు.

ఉత్సాహంగా సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న 5వ రోజు వేసవి క్యాంపు ఉత్సాహంగా జరిగింది. తొలుత కరాటే, వ్యాయామంలో ఉదయం యోగేష్, లోకేష్ శిక్షణ ఇచ్చారు. తెలుగు పద్యాలపై ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, బాల గీతాలు పాడటంలో ఉపాధ్యాయురాలు బేబీరత్నం, హిందీ బోధనపై విమలారాణి, డ్రాయింగ్‌లో గూనూరు వెంకటరమణ, దేశభక్తి గీతాలపై దారపురెడ్డి కృష్ణ శిక్షణ ఇచ్చారు. మిషన్ అన్నపూర్ణ సహాయనిధి ప్రతినిధి వెలగా త్రిపుర పుట్టినరోజు సందర్భంగా మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ క్యాంపులో రొంగల అరుణ్‌కుమార్, కూనిరెడ్డి రవి, అమృత, నమ్రత, మణికంఠ పాల్గొన్నారు.

ప్రత్యేక రథంపై ఊరేగిన సత్యదేవుడు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యదేవుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రత్యేకంగా తయారు చేసిన భారీ రథంపై సతీ సమేతంగా సత్తిదేవుడు ఊరేగాడు. దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ ఐవి.రోహిత్ కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించగా అశేష సంఖ్యలో తరలివచ్చిన యాత్రికులు రథాన్ని లాగుతూ స్వామి వారితో పాటు ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం భక్తులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శిరోముండనం బాధితులకు కుల ధృవీకరణ పత్రాలు

ప్రజాశక్తి - రామచంద్రాపురం

శిరోముండనం బాధితులకు కులధృవీకరణ పత్రాలను ఆదివారం మంత్రి సుభాష్ అందజేశారు. నియోజకవర్గంలోని వెంకటాయపాలెం గ్రామంలో దళితులకు శిరోముండనం జరిగి సుమారుగా 30 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ బాధితులకు సరైన న్యాయం జరగలేదు. ఎస్‌సి, ఎస్‌టి కేసుకు ప్రధాన ఆధారమైన కుల ధృవీకరణ పత్రాలను బాధితులకి ఇప్పటికీ అందకుండా ఆటంకాలు సృష్టించారు. అయితే ఇటీవల శిరోమండనం బాధితులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ని కలిసి వారి గోడును విన్నవించారు. తక్షణమే మంత్రి సుభాష్ కలెక్టర్‌తో, తహశీల్దార్‌తోను మాట్లాడి బాధితులకు ఆరు రోజుల్లో క్యాస్ట్ సర్టిఫికెట్ ఇచ్చే విధంగా చేయాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలను శిరోమండనం బాధితులు కోటి చిన్న రాజు, దండాల వెంకటరత్నం, చల్లపల్లి పట్టాభి రామయ్యలకు ఆదివారం మంత్రి చేతుల మీదగా అందజేశారు. దీనిపై దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, అసంఘటిత కార్మిక సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి అర్జున్‌రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిందన్నారు. వ్యవసాయ చట్టాల ద్వారా రైతులు భూమిని కార్పొరేట్లకు కట్టబట్టేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వీరబాబు, అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు ఎ.నాగమణి మాట్లాడారు.

పుట్టిన తేదీ ధృవీకరణ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నేను, చామర్తి రవికుమార్, తండ్రి హనుమంతరావు,తల్లి సువర్చల, ఇంటి నెం:2-9 మెయిన్ రోడ్డు, చిలకపాడు గ్రామం, ఉండ్రాజవరం మండలం, ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దంపతులకు చిలకపాడు గ్రామంలో **ది.15/08/1963** వ తేదీన జన్మించి యున్నాను. ఈ తేదీ నా యొక్క పదవ తరగతి మార్కుల మెమో ననుసరించి ధృవీకరించబడినది. కావున, నా జనన తేదీ ధృవీకరణపై ఎవరికైనా, ఏవిధమైన అభ్యంతరాలున్న యెడల నేటినుండి 7రోజులు లోపుగా కొవ్వూరు ఆర్డీవో, ఉండ్రాజవరం తహసిల్దార్, చిలకపాడు గ్రామపంచాయతీ కి గాని తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

చామర్తి రవికుమార్
s/o. హనుమంతరావు, డో.నెం: 14.1.16/2,
నరసాపురం, ప.గో జిల్లా. 524275.
సెల్ నెంబర్.7013643796.